### కాంగ్రెస్ తీరుతోనే ఆత్మబలిదానాలు

హస్తం పార్టీ పదేండ్లపాటు కాలయాపన చేయడంతో కొందరు నిరుద్యోగులు, యువత, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పదేండ్ల కాలంలో వందలాది మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. విద్యార్థులు, యువత ఉరి పెట్టుకుని బలిదానం చేశారు. వందలాది తల్లులకు కడుపుకోత మిగిల్చారు. కానీ, చిదంబరం మాత్రం ఉద్యమాలంటే కొందరు పోతారంటూ అమరులను అవమానించేలా మాట్లాడారు. బలిదానాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించదని నోటికొచ్చినట్లు మాట్లాడారు. దీనిపై అమరుల కుటుంబ సభ్యులు ఫైర్ అవుతున్నారు. పదేండ్ల తర్వాత అమరులు గుర్తుకొచ్చారా? అంటూ కడిగిపారేస్తున్నారు. ఇప్పుడు ఓట్ల కోసం కాకమ్మ కబుర్లు చెబుతున్నారని మండిపడుతున్నారు. కాగా గతంలోనూ చిదంబరం తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసిన చూపిన విషయం తెలిసిందే.




తెలంగాణ అమరులను అగౌరవపరిచిన చిదంబరం

## మా కుటుంబానికి కేసీఆర్ సార్ పెద్ద దిక్కైండు



తెలంగాణ అమరవీరుడు సయ్యద్ మహబూబ్ అలీ తల్లిదండ్రులు సయ్యద్ ఫాతిమా, ఫాజిల్,

- రూ.10లక్షలతోపాటు మా చిన్న కొడుక్కు ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నడు
- తెలంగాణ అమరవీరుడు మహబూబ్ అలీ తల్లిదండ్రులు ఫాతిమా, ఫాజిల్

భువనగిరి అర్బన్, నవంబర్ 18 : మేము భువనగిరి పట్టణంలోని పహాడీనగర్‌లో జీవనం కొనసాగిస్తున్నాం. మా పెద్ద కొడుకు సయ్యద్ మహబూబ్ అలీ ఆటో నడుపుతూ మా కుటుంబాన్ని పోషించేవాడు. 2011లో తెలంగాణ రావాలని సీఎం కేసీఆర్ సాబ్ పిలుపుతో కొట్లాడుతున్నప్పుడు రోజూ రోడ్లపై జరిగే సకల జనుల సమ్మె, ధర్నాల్లో పాల్గొనేవాడు. తెలంగాణ రాదని అందరూ అంటుంటే ఇంటికి వచ్చినప్పుడల్లా మాతో తెలంగాణ ఆతా.. నై ఆతా అని అంటుండేవాడు. ఇలా నిత్యం సమ్మెలు, ధర్నాల్లో పాల్గొనేవాడు. ఈ క్రమంలో ఒకరోజు ధర్నాకు వెళ్లివచ్చాక ఇంట్లో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఏమైంది అలా ఉన్నావు? అని అడిగితే ఏమీ చెప్పలేదు. నవంబర్ 4, 2011న ఒంటిపై కిరోసిన్ పోసుకుని కాల్చుకున్నాడు. తీవ్రగాయాలతో చనిపోయాడు. ఉద్యమం సమయంలో మా కొడుకు అన్న మాటలు ఇప్పటికీ మదిలో మెదులుతున్నాయి. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ సాబ్ మా కుటుంబాన్ని గుర్తించిండు. మాకు కొడుకు లేడనే బాధ ఉన్నప్పటికీ తెలంగాణ వచ్చేందుకు మా కొడుకు ప్రాణత్యాగం కూడా కారణమని తెలిసి సంతోషపడుతున్నామని తెలంగాణ అమరుడు మహబూబ్ అలీ తల్లిదండ్రులు ఫాతిమా, ఫాజిల్ తమ గుండెల నుంచి వస్తున్న బాధను దిగమింగుకుంటూ తెలిపారు.

### కాంగ్రెస్సే బాధ్యత వహించాలి

తెలంగాణ ప్రకటన జాప్యంతోనే ఎందరో యువకులు బలిదానానికి పాల్పడ్డారు. అందులో మా కొడుకు కూడా ఉన్నాడు. అమరుల ఆత్మత్యాగాలకు కాంగ్రెస్సే బాధ్యత వహించాలి. ఉద్యమ సమయంలో కేంద్ర హోంమంత్రిగా ఉన్న చిదంబరం అమరుల త్యాగాలను అపహాస్యం చేయడం సరికాదు. ప్రకటన చేసిన వెంటనే తెలంగాణ ఇస్తే ఇంత మంది చనిపోయేవారు కాదు. అంతేకాకుండా అమరుల కుటుంబాలకు కేంద్రం ఎలాంటి సాయం చేయలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సాబ్ మా కుటుంబాన్ని గుర్తించి రూ.10 లక్షలు అందజేశాడు. అంతే కాకుండా నా చిన్న కొడుక్కు రెవెన్యూ శాఖలో ఉద్యోగం, నాకు ప్రతి నెలా పింఛన్ అందజేస్తూ మా కొడుకు లేడనే లోటును తీర్చుతున్నాడు. ఆయనకు రుణపడి ఉంటాం.

# 'సారీ'తో సరి

- పదేండ్ల తర్వాత ఎన్నికల్లో ఓట్ల కోసం చిల్లర మాటలు
- ఉద్యమాలంటే కొందరు పోతారట.. కేంద్రానికి బాధ్యత లేదట
- కాంగ్రెస్ నేత వ్యాఖ్యల అమరుల కుటుంబ సభ్యుల ఆగ్రహం
- నాడు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కాలయాపన చేసిందే కాంగ్రెస్
- ఆంధ్రా లాబీకి తలొగ్గి పదేండ్ల పాటు నాన్చివేత
- బలిదానాలతోనైనా రాష్ట్రం వస్తుందని వందల మంది ఆత్మార్పణం
- ఎందరో తల్లులకు కడుపుకోత మిగిల్చిన కాంగ్రెస్
- నాడు హస్తం పార్టీ తీరుతోనే యువత, విద్యార్థుల ఆత్మబలిదానాలు

తెలంగాణ పోరాటాన్ని తలచుకుంటే ఉద్యమ స్ఫూర్తి ప్రజ్వరిల్లుతుంది. చిన్న పిల్లల నుంచి ముసలోళ్ల వరకు తెలంగాణ జెండా చేతబట్టి ఉద్యమంలో కదం తొక్కారు. తెలంగాణే శ్వాస, ఆశగా ముందుకు సాగారు. ఆనాటి కనికరం లేని కాంగ్రెస్ కారణంగా వందల మంది ఆత్మబలిదానాలకు పాల్పడ్డారు. అమరుల త్యాగాన్ని కాంగ్రెస్ నేత చిదంబరం చిన్నదిగా కొట్టిపారేశారు. ఏదో మొక్కుబడిగా సారీతో సరిపెట్టారు. దీనిపై అమరుల కుటుంబాలు భగ్గుమంటున్నాయి. తమను అగౌరవ పర్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ)

### పదేండ్లు నాన్చిన కాంగ్రెస్..

తెలంగాణ కోసం యావత్ తెలంగాణ ఒక్కటై ఉద్యమించింది. కాంగ్రెస్ పార్టీ సైతం తెలంగాణ ఏర్పాటు చేస్తామని 2004లో ప్రకటించింది. కానీ ఓట్లు దండుకున్నా ఆ ముచ్చటే పట్టించుకోలేదు. 2009లో కేసీఆర్ దీక్ష తర్వాత నాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం తెలంగాణను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అప్పుడే కాంగ్రెస్ ఇచ్చినట్లే ఇచ్చి.. పెండింగ్‌లో పెట్టింది. ఆంధ్రా నేతల లాబీయింగ్‌కు తలొగ్గి తెలంగాణకు మరోసారి అన్యాయం చేసింది. ఓ దశలో తెలంగాణ అవసరమా? అన్న విధంగా వ్యవహరించింది. సుమారు పదేండ్లపాటు తెలంగాణ ఏర్పాటు చేయకుండా నాన్చింది. రాష్ట్ర ఏర్పాటుకు వివిధ కమిటీలు, సంప్రదింపులు, సలహాలు, సూచనల పేరుతో కాలయాపన చేసింది.

### నాడు ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం

నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. సబ్బండ వర్గాలు ఏకమై ఉద్యమించాయి. ధూందాం ఆటపాటలు, వంటావార్పులు, రోడ్లపై నిరసనలు, రాస్తారోకోలు, అడ్డగింతలు, సభలు, సమావేశాలు ఇలా ఒక్కటని కాదు... ప్రపంచమే నివ్వెరపోయేలా తెలంగాణ పోరాట స్ఫూర్తి నిలిచింది. నాడు తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా ఉద్యమకారులు ముందుకు నడిచారు. ఆత్మబలిదానాలు చూసి తెలంగాణవాదులంతా చలించిపోయారు. నాడు అమరుల అంతిమ యాత్రలు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. అంతిమ యాత్రలకు ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారంటే అమరుల త్యాగాలను అర్థం చేసుకోవచ్చు.

## తన చావుతోనైనా తెలంగాణ రావాలని ప్రాణాలు వదిలిండు

### నా భర్త త్యాగం వృథా కాలేదు

- స్వరాష్ట్రం సిద్ధించి ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్నది
- మా కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన సీఎం కేసీఆర్
- ఉద్యోగం ఇచ్చి ఆదుకున్న దేవుడు ముఖ్యమంత్రి సారు

తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జెకట్టిన సవ్వడి చప్పుడు నా చెవులకు ఇప్పటికే వినిపిస్తూనే ఉంది. ఆడిపాడిన పాటలు గుర్తుకొస్తూనే ఉన్నాయి. తెలంగాణ వచ్చినంక నా భర్త నాకు కన్పించకుండా పోయిన బాధ ఇప్పటికీ గుండెల్లో తడుతూనే ఉంది. నా భర్త త్యాగం వృథా కాలేదు. ఎంతో మంది తెలంగాణ ప్రజల ఆశల్లో జీవం పోసిండు. ఆంధ్ర పాలకుల బానిస సంకెళ్ల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించిండు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన తన భర్త త్యాగాన్ని తెలంగాణ సర్కారు గుర్తించి మా కుటుంబానికి రూ.10 లక్షలతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకున్న దేవుడు సీఎం కేసీఆర్ సారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు గంధమల్ల రాములు భార్య సత్యలక్ష్మి 'నమస్తే తెలంగాణ'తో తన మనోగతాన్ని పంచుకుంటూ కన్నీటి పర్యంతమైంది.

– రాజాపేట, నవంబర్ 18



గంధమల్ల రాములు ఫొటోతో ఆయన భార్య సత్యలక్ష్మి

### తెలంగాణ కోసం ప్రాణత్యాగం

తెలంగాణ కోసం అసువులు బాసి అమరుడైన గంధమల్ల రాములు వృత్తి జర్నలిస్టుగా, ప్రవృత్తి కళాకారుడిగా కాలికి గజ్జెకట్టి ఆడుతూ పాడుతూ తెలంగాణ ప్రజలను ఉద్యమం వైపు నడిపించాడు. తన జర్నలిజంతో ఎంతో మంది పేదల సమస్యలు పరిష్కరించాడు. తెలంగాణలో ఆంధ్ర పాలకుల పెత్తనంతో ప్రజలు పడుతున్న బాధలను తన కలంతో పదిమందికి తెలియజేస్తూ తన మధురమైన గళంతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. తెలంగాణ ఉద్యమం ఉవెత్తున్న ఎగిసి పడుతున్న తరుణంలో సీమాంధ్రుల కుట్రలకు తెలంగాణ రాదేమోనని తీవ్ర మనస్థాపానికి గురై తన ప్రాణ త్యాగంతోనైనా తెలంగాణ వస్తుందని నమ్మి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన చావుతోనైనా తెలంగాణ సిద్ధించాలని సూసైడ్ నోటు రాసుకొని భువనగిరి నడిబొడ్డున అంబేద్కర్ సాక్షిగా బైక్‌పై వెళ్తూ అందరూ చూస్తుండగానే జై తెలంగాణ నినాదాలు చేస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ఆత్మత్యాగం చేసి తెలంగాణ అమరవీరుడిగా చరిత్రలో నిలిచాడు గంధమల్ల రాములు.

### కాంగ్రెస్ కాలయాపనతోనే ఆత్మహత్యలు

తెలంగాణ ఇస్తున్నట్లు చేసిన ప్రకటనను మళ్లీ వెనక్కి తీసుకోవడంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రకటన చేసినప్పుడే రాష్ట్రాన్ని ఇస్తే ఇంతమంది చనిపోయేవారు కాదు. 2009 డిసెంబర్‌లో చేసిన ప్రకటన వెనక్కి తీసుకువడంతో ఇక తెలంగాణ వస్తుందో, రాదోనని ఎంతో మంది తెలంగాణ ఉద్యమకారులు, యువత చనిపోవడం జరిగింది. ఆత్మహత్యలకు అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనే బాధ్యత వహించాలి. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన మా కుటుంబాన్ని గుర్తించి తెలంగాణ ప్రభుత్వ నాకు ఉద్యోగం ఇచ్చింది. యాదగిరిగుట్ట తాసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నా.

–గంధమల్ల సత్యలక్ష్మి, శ్రీరాములు భార్య